సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 24 । జనవరి । 2023



లక్ష పుష్పార్చన

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల వైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరీకి లక్ష పుష్పార్చన నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు, మహాగణపతి హోమం జరిగాయి.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్ గోశాలలోని 20 కోడెలను జనగామ జిల్లా దేవరుప్పాల మండలం ధర్మపురం గ్రామానికి చెందిన శ్రీభద్రకాళి గోశాలకు సోమవారం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
30.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గ్రామాల్లో పౌరగ్రంథాలయాలు



పోటీ పరీక్షల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శంకరయ్య

ఇల్లంతకుంట(మానకొండూరు): నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధమయ్యేలా తోడ్పాటు నందించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో పౌర గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శంకరయ్య, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలంలోని 2500 జనాభా గల గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పౌర గ్రంథాలయాల నిర్వహణకు నెలకు రూ.2వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మల్లెంకి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్, ఆరెపల్లి ఉపసర్పంచ్ కిషన్, మెరుగు రాజు ఉన్నారు.

హమాలీ కూలి సర్కారే చెల్లించాలి



కలెక్టరేట్‌ను ముట్టడించిన కార్మికులు

సిరిసిల్లటౌన్: ఐకేపీల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వమే కూలి చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు తీర్చాలని కోరుతూ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. క్వింటాల్ బస్తాకు రూ.50 ప్రభుత్వమే చెల్లించాలని, హమాలీ వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని కాకుండా స్థానిక హమాలీలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, హమాలి యూనియన్ అధ్యక్షుడు సామనపల్లి రాములు, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

న్యాయవాదులు ఆటల పోటీలు



క్యారమ్ ఆడుతున్న న్యాయవాదులు

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆటల పోటీలు సోమవారం జరిగాయి. క్యారమ్, చెస్, షటిల్ పోటీల్లో న్యాయవాదులు పోటీ పడ్డారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వేముల సుధాకర్, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడిసె సదానందం తెలిపారు. షటిల్ పోటీలను డీఎస్పీ నాగేంద్రాచారి ప్రారంభించారు.

ఫారెస్ట్ సిబ్బందిని అడ్డుకున్న గిరిజనులు



ట్రాక్టర్ ముందు బైఠాయించిన గిరిజనులు

వేములవాడరూరల్: చందుర్తి మండలంలోని జలపతితండాకు చెందిన గిరిజనుడు లకావత్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు వేములవాడ ఫారెస్టు అధికారి ఖలీలొద్దీన్ తెలిపారు. ఖలీలొద్దీన్ తెలిపిన వివరాలు. జలపతితండాకు చెందిన లకావత్ అటవీశాఖకు చెందిన భూమిలో దున్నుతుండగా ఫారెస్ట్ సిబ్బంది అక్కడికెళ్లి అడ్డుకున్నారు. ట్రాక్టర్‌ను తీసుకుని వస్తుండగా మల్లారం, జయవరం గ్రామాల మధ్య గిరిజనులు అడ్డుపడ్డారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఫారెస్ట్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మహిళలను అడ్డు తొలగించారు. సంతోష్‌తోపాటు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సిరిసిల్ల- సిద్దిపేటకు లైన్ క్లియర్!

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేమార్గంలో ముందడుగు
- రెండు పట్టణాల మధ్య ట్రాక్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- 30 కి.మీ.కి రూ.440 కోట్ల అంచనా వ్యయం
- బిడ్లు ఆహ్వానించిన దక్షిణ మధ్య రైల్వే
- హైదరాబాద్-సికింద్రాబాద్ డివిజన్ల వారధిగా కరీంనగర్



వేములవాడ-కరీంనగర్ రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ మార్గంలో మరో ముందడుగు పడింది. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ (కొత్తపల్లి) నగరాలను కలిపే అద్భుత ప్రాజెక్టు ఇది. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు తెలంగాణ వచ్చాక పట్టాలెక్కింది. ప్రస్తుతం గజ్వేల్ వరకు ట్రాక్ పనులు పూర్తయి.. ట్రయల్ రన్ కూడా నడుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిరిసిల్ల-సిద్దిపేట పట్టణాలను కలుపుతూ సుమారు 30 కిలోమీటర్ల దూరానికి బ్రాడ్‌గేజ్ రైల్వేట్రాకు నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే బిడ్లు ఆహ్వానించింది. ఈ పనులకు రూ.440 కోట్ల మేరకు అంచనా వ్యయాన్ని కూడా రూపొందించింది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి (కరీంనగర్) వరకు 151.36 మొత్తం కిలోమీటర్లు బ్రాడ్‌గేజ్‌లైన్. ఈ మార్గంలో సిద్దిపేట స్టేషన్(77 కి.మీ)-సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) మధ్యన మొత్తం 29.8 కి.మీ ఈ బ్రాడ్ గేజీ పనులకు రూ.440.288 ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో కాంట్రాక్టు అప్పగించేందుకు దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులను ఆహ్వానించింది.

ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..!

వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో 2006-07లో 151 కి.మీ.ల కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైనును రూ.1,167 కోట్ల అంచనా వ్యయంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తరువాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి చేపట్టేందుకు రైల్వేశాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్లపాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్రం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందోనని సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

మొదలైన ట్రయల్‌రన్..

ప్రస్తుతానికి మనోహరాబాద్- గజ్వేల్ మధ్య 32 కి.మీ. మేర ట్రాక్ పూర్తయి ట్రయల్‌రన్ కూడా నడుస్తోంది. త్వరలోనే మనోహరాబాద్-గజ్వేల్ నూతన రైల్వే మార్గంలో త్వరలోనే రైళ్ల నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు కొత్తగా నిర్మించిన 9.6 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను ఇటీవల రైల్వే సేఫ్టీ కమిషనర్ అభయ్‌కుమార్ రాయ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు కూడా. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే కోల్‌కతా, న్యూఢిల్లీ, ముంబై తదితర మహా నగరాలకు ఈ ప్రాంతంతో రైల్ కనెక్టివిటీ పెరుగుతుంది. పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల వారికి ముంబై, బెంగళూరు, చెన్నై, షిర్డీ, తిరుపతికి ఇక్కడి నుంచి రైళ్ల నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచింది.

రెండు డివిజన్లకు వారధిగా ఈ మార్గం..!

దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం ఆరు డివిజన్లు ఉండగా అందులో మూడు దక్షిణ కోస్తా పరిధిలోకి వెళ్లాయి. ఇప్పుడు హైదరాబాద్, సికింద్రాబాద్, నాందెడ్ డివిజన్లు సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉన్నాయి. కొత్తపల్లి-మనోహరాబాద్ సెక్షన్ హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. అదే సమయంలో కాజీపేట- బల్లార్ష సెక్షన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. ఈ రెండు డివిజన్లను కలిపే వారధిలా కరీంనగర్ (కొత్తపల్లి) వద్ద మారనుంది. జగిత్యాల, నిజామాబాద్‌తోపాటు నాందేడ్ డివిజన్‌ను కలుపుతూ ఉత్తరాదికి వెళ్లేందుకు.. పెద్దపల్లి, కాజీపేట నుంచి వచ్చే రైళ్లకు కరీంనగర్ కేంద్ర బిందువుగా మారనుంది.

కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గం విశేషాలు..!

- విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్.
- మార్గం తాకుతూ వెళ్లే గ్రామాలు: 70
- రూట్లో మొత్తం రైల్వే స్టేషన్లు: 15
- ఈ మార్గంలో పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహా స్వామి ఆలయాలు.
- మొత్తం పొడవు: 151.36 కి.మీ.
- మెదక్ జిల్లాలో..: 9.30 కి.మీ.
- సిద్దిపేట జిల్లాలో..: 83.40 కి.మీ.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో..: 37.80 కి.మీ.
- కరీంనగర్ జిల్లాలో..: 20.86 కి.మీ.
- పూర్తిస్థాయిలో పూర్తయిన మార్గం: 42.6 కి.మీ.
- రెండో దశలోని గజ్వేల్ టూ దుద్దెడ : 32 కి.మీ.

నేతాజీకి నివాళి



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్/వేములవాడ: స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపించిన పోరాట పటిమ దేశ ప్రజలకు ఆదర్శనీయమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. స్థానిక సుభాష్‌నగర్‌లోని నేతాజీ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, టెక్స్‌టైల్ అండ్ పవర్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, నాయకులు జిందం చక్రపాణి, గడ్డం నర్సయ్య పాల్గొన్నారు. వేములవాడలోని సుభాష్‌నగర్‌లోని నేతాజీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ యాగం



మార్కండేయ యాగంలో పాల్గొన్న భక్తులు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని నెహ్రూనగర్ శ్రీసీతారామాంజనేయ ఆలయంలో సోమవారం మార్కండేయ యాగం నిర్వహించారు. కౌన్సిలర్ గడ్డం చందనభగవాన్, తాటిపాముల శ్రీనివాస్ యాగ దంపతులుగా వ్యవహరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు కోడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు శోభాయాత్ర

మార్కండేయ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే యాత్రలో పెద్ద సంఖ్యలో పద్మశాలీలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు.



కబడ్డీ విన్నర్ చెక్కపల్లి

వేములవాడరూరల్: ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వేములవాడ మండలం చెక్కపల్లి జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని నూకలమర్రిలో చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయి. సోమవారం రాత్రి ఫైనల్ మ్యాచ్ చెక్కపల్లి, గన్నేరువరం జట్లు మధ్య జరిగింది. విజేతగా చెక్కపల్లి, రన్నరప్‌గా గన్నేరువరం, మూడో స్థానంలో నూకలమర్రి జట్లు నిలిచాయి. ఆయా జట్లకు నగదు బహుమతులు, ట్రోఫీ అందజేశారు.



రాజన్న ఆలయంలో భక్తులు



తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాజన్నకు జనజాతర

వేములవాడ: వేములవాడ రాజన్న చెంత సోమవారం జాతరను తలపించింది. రాజన్న దర్శనానికి దాదాపు 40వేల మంది భక్తులు తరలివచ్చారు. భారీగా భక్తులు రావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసి పోయింది. ధర్మగుండంలో స్నానాలు చేసి, తడి బట్టలతోనే దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్నారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు. డీఎస్పీ నాగేంద్రాచారి ఆధ్వర్యంలో భక్తులకు క్యూలైన్లలో పాలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు సేవలందించారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఈమె పేరు దేశరాజు శ్రీజ. సిరిసిల్లలోని వెంకట్రావునగర్‌లో ఉండే శ్రీజకు ముగ్గురు పిల్లలు. భర్త సంతోష్ బహ్రెయిన్ వెళ్లాడు. రెక్కలు ముక్కలు చేస్తూ బీడీలు చేసి నెలకు రూ.2వేలు సంపాదించేది. ఆ డబ్బులతో ఇల్లు వెళ్లదీయడం కష్టంగా ఉండేది. పది నెలల కిందట పెద్దూరు శివారులోని అపెరల్ పార్క్‌లో గార్మెంట్ పరిశ్రమలో చేరింది. నిత్యం 8 గంటలు పనిచేస్తూ నెలకు రూ.10వేలు సంపాదిస్తుంది. పిల్లలను చదివిస్తూ.. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆత్మవిశ్వాసంతో జీవిస్తోంది.



ఈమె పేరు గుగులోత్ జ్యోతి. వీర్నపల్లికి చెందిన జ్యోతి బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ చేసింది. 2019లోనే చదువు పూర్తికావడం.. లాక్‌డౌన్ రావడంతో ఉద్యోగం రాలేదు. భర్త రవి రైతు. వీరికి ఒక్క పాప. బ్యాంకు ఉద్యోగం కోసం నంద్యాలకు కోచింగ్‌కు వెళ్లింది. కానీ ఆర్థిక ఇబ్బందులతో చదువు సాగలేదు. 9 నెలల కిందట అపెరల్ పార్క్‌లో క్వాలిటీ చెకింగ్ ఇన్‌చార్జిగా చేరింది. నెలకు రూ.10వేల వేతనం వస్తుంది. సిరిసిల్లలో ఉంటూ ఉపాధి పొందుతుంది.



ఈమె ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన కాసారపు లావణ్య. బీడీ కార్మికురాలు. నిత్యం వెయ్యి బీడీలు చేస్తూ నెలకు రూ.2500 నుంచి రూ.3వేలు సంపాదించేది. తొమ్మిదేళ్ల క్రితం భర్త చంద్రశేఖర్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో ఇద్దరు పిల్లల పోషణభారం లావణ్యపై పడింది. బీడీల పనితో ఇల్లు గడవని పరిస్థితి ఉండేది. అపెరల్‌పార్క్‌లో పనిచేస్తూ ఇప్పుడు నెలకు రూ.7,500 సంపాదిస్తుంది. ప్రభుత్వం ఆసరా పెన్షన్ రూ.2,016 ఇస్తుంది. భర్త లేక పోయినా కుటుంబానికి పెద్ద దిక్కుగా మారి ఇద్దరు పిల్లలను చదివిస్తుంది. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. ఏకంగా 420 మంది మహిళలు, మరో 80 ఇతర అన్ని రకాల ఉద్యోగులు కలిసి ఓ 500 మంది మెరుగైన ఉపాధి సాధిస్తున్నారు.

ఉపాధికి బాటలు

- మహిళలకు మెరుగైన బతుకుదెరువు
- అపెరల్‌పార్క్‌లో వస్త్రాల తయారీ
- సిరిసిల్ల నుంచి అమెరికాకు ఎగుమతులు
- 10 నెలలుగా నాణ్యత.. నవ్యతతో ముందుకు..

సిరిసిల్ల: రెడీమేడ్ వస్త్ర పరిశ్రమ జిల్లా మహిళలకు మెరుగైన ఉపాధి కల్పిస్తుంది. గతంలో నెలకు రూ.3వేల లోపు సంపాదించిన మహిళలు.. నేడు రూ.10వేల వేతనంతో మెరుగైన జీవన గడుపుతున్నారు. కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. పిల్లలకు మెరుగైన విద్యనందిస్తూ బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఇదంతా పెద్దూరు శివారులోని అపెరల్‌పార్క్‌లో పనిచేస్తున్న మహిళల ఉపాధి గాథ.

500 మందికి ఉపాధి

సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద 60 ఎకరాల్లో అపెరల్‌పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ తొలి యూనిట్‌ను గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ గతేడాది ప్రారంభించింది. ప్రస్తుతం 500 మంది ఉపాధి పొందుతుండగా.. మరో వెయ్యి మందికి పని కల్పించే లక్ష్యంతో యూనిట్‌ను విస్తరిస్తున్నారు. నిత్యం 35 వేల నుంచి 40 వేల వరకు లోదుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. నెలకు 8 నుంచి 9 లక్షల పీసులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. సిరిసిల్లలో తయారైన వస్త్రాలు వాల్‌మార్ట్, అమేజాన్ వంటి అంతర్జాతీయ సంస్థల ద్వారా ప్రపంచ స్థాయికి ఎగుమతి కావడం విశేషం. రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు చొరవతో అపెరల్ పార్క్ కార్యరూపం దాల్చింది. అపెరల్‌పార్క్‌లో కొనసాగుతున్న మరిన్ని యూనిట్ల నిర్మాణాలు పూర్తయితే జిల్లాలో మహిళల ఉపాధికి కేరాఫ్‌గా మారనుంది.

ఉచితంగా బస్సు సౌకర్యం

సిరిసిల్ల, వేములవాడ, జిల్లెల్ల, ఎల్లారెడ్డిపేట మార్గాల్లో ఐదు బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. ఆ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. యూనిట్‌లోనే క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఉచితంగానే భోజన వసతి కల్పించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రెండు షిఫ్ట్‌ల్లో పనులు చేస్తున్నారు. పసిపిల్లలు ఆడుకోవడానికి కేర్ సెంటర్, వాష్‌రూమ్స్, రెస్ట్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. కొత్త వారికి 15 రోజులపాటు శిక్షణనిచ్చి పని కల్పిస్తున్నారు.



అపెరల్ పార్క్‌లో పనిచేస్తున్న మహిళలు

యూనిట్‌ను విస్తరిస్తాం



ప్రస్తుతం 400 మంది మహిళలు పనిచేస్తున్నారు. ఇంకా యూనిట్‌ను విస్తరించాలని సంస్థ భావిస్తోంది. ఫిబ్రవరి వస్తే సంస్థ పని ప్రారంభించి ఏడాది అవుతుంది. వెయ్యి మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో సిరిసిల్ల యూనిట్‌ను విస్తరిస్తుంది. ఇక్కడ మహిళలు కష్టపడి, ఇష్టంగా పనిచేస్తున్నారు. యూనిట్ బాగా నడుస్తుంది. – బి.వి.యుగంధర్, గోకుల్‌దాస్ సంస్థ జీఎం

క్లుప్తంగా

రాజన్న ఆలయానికి అంబులెన్స్ అందజేత


ఈవో కృష్ణప్రసాద్‌కు అంబులెన్స్ బహూకరిస్తున్న రాజమణిదేవీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రమణ

వేములవాడ: రాజన్న భక్తులకు ఆపదలో ఆదుకునేందుకు రాజమణిదేవీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం అంబులెన్స్‌ను అందజేశారు. ట్రస్టు ప్రతినిధి రమణ ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌కు అందజేశారు. రమణ మాట్లాడుతూ ఇటీవల ఓ భక్తుడికి సరైన సమయంలో వైద్యం అందక మరణించాడని తెలుసుకుని బాధపడ్డామన్నారు. తమ ట్రస్టు ద్వారా భక్తులకు సేవలందించాలనే ఉద్దేశంతో అంబులెన్స్‌ను అందజేసినట్లు చెప్పారు.

రాజన్న సేవలో రిటైర్డ్ డీజీపీ దినేశ్‌రెడ్డి


దినేశ్‌రెడ్డి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న ఏఈవో ప్రతాప నవీన్

వేములవాడ: రాజన్నను రిటైర్డ్ డీజీపీ దినేశ్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. స్వామి వారి దర్శనానంతరం ఏఈవో ప్రతాప నవీన్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, అర్చకులతో వేదోక్త ఆశీర్వచనం గావించారు. డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ వెంకటేశ్, ఎస్సై వెంకట్రాజం ఉన్నారు.

మేకల దొంగలు అరెస్టు

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని పలు గ్రామాల్లో మేకలు, వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని ఎర్రనర్సుపల్లికి చెందిన పర్శ శంకరయ్య, రాగుల పర్శరామ్‌లకు చెందిన 15 మేకలను అదే గ్రామానికి చెందిన గుడిసె అజయ్, రాగుల దుర్గయ్య, రాగుల పర్శరాంకు చెందిన మూడు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. ఇల్లంతకుంటలో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఎర్రనర్సుపల్లికి చెందిన తొత్తళ్ల అనిల్, రాగుల అనిల్, సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం విఠాలాపూర్, మాచాపూర్ గ్రామాలకు చెందిన సముద్రాల శ్రీనివాస్, కోడూరి స్వామిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.39 వేల నగదు, మూడు విద్యుత్ మోటార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న ఎస్సై మహేందర్, సిబ్బందిని సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- 23 అర్జీలు స్వీకరణ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొత్తం 23 దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఇన్‌చార్జి డీఆర్‌వో శ్రీనివాస్‌రావు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

పాఠశాల స్థలాన్ని కాపాడండి



కోనరావుపేట మండలం సుద్దాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలానికి హద్దులు చూపించి ఆక్రమణకు గురికాకుండా చూడండి. సర్వే నంబర్ 424లో హద్దులు లేకపోవడంతో కబ్జాలకు గురవుతుంది. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినం. సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైన అధికారులు పాఠశాలకు హద్దులు చూపించి స్థలాన్ని కాపాడాలి.

– ఎరవెల్లి నాగరాజు, సుద్దాల ఉపసర్పంచ్

బ్యాంక్ అధికారులు పెన్షన్ ఇస్తలేరు



పంటలోన్ ఉందని బ్యాంక్ అధికారులు పెన్షన్ పైసలు, రైతుబంధు పైసలు ఇస్తలేరు. నాకు దాదాపు 15 ఏళ్లుగా పింఛన్ వస్తుంది. గత ఆరు నెలల నుంచి బ్యాంక్ అధికారులు పెన్షన్ డబ్బులు ఇస్తలేరు. క్రాఫ్‌లోన్ కోసం డబ్బులను కట్ చేసుకుంటున్నారు. దయచేసి పెన్షన్ డబ్బులు ఇప్పించండి.

– బోనగోని లచ్చవ్వ, వృద్ధురాలు

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో అక్రమంగా వెలసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. మరికొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేసేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. చంద్రగిరి గ్రామపంచాయతీ తెట్టకుంట శివారులో సర్వే నంబర్ 6లోని భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించేసి అమ్మేస్తున్నారు. అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి.

– చొక్కాల రాము,వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య


మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. డబుల్ ఇళ్లకు అర్హులను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ ఆఫీస్‌లో సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఆగయ్య మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం, బండలింగంపల్లి, అక్కపల్లి, రాచర్లతిమ్మాపూర్, హరిదాస్‌నగర్, పదిర గ్రామాల్లోని ఇళ్లు లేని 170 మంది నిరుపేదలను గుర్తించినట్లు తెలిపారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, సర్పంచులు అమృత, మధుకర్, నర్సయ్య, వాణి, రవీందర్, శంకర్ నాయక్, ఎంపీటీసీలు మల్లేశం, మధు, ఉపసర్పంచ్ ఉస్మాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రోడ్డుపై పడిపోయిన బాలయ్య


అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం నామాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోతుగల్‌కు చెందిన బండారి బాలయ్య(45) ద్విచక్ర వాహనంపై ఒడిశా కార్మికురాలు శీలవతి(53)తో నామాపూర్ వైపు వెళ్తుండగా.. నామాపూర్‌కు చెందిన సడిమెల రాజలింగం బైక్‌పై అటు వైపే వెళ్తున్నాడు. ఈక్రమంలో రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజలింగంను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాయపడ్డ మిగతా ఇద్దరు సిరిసిల్ల ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

మధుమేహంతో డిగ్రీ విద్యార్థిని మృతి

- ఎల్లారెడ్డిపేటలో విషాదం
- 6 నెలలుగా చికిత్స పొందుతూ కన్నుమూత
- రూ.9.50 లక్షలు వెచ్చించిన దక్కని ప్రాణం


చందనారెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): డిగ్రీ పూర్తి చేసి ఉన్నతంగా స్థిరపడదామనుకున్న యువతి ఆశలు ఆవిరయ్యాయి. పెళ్లి చేసి అత్తారింటికి పంపుదామని కలలు కన్న తల్లిదండ్రుల గుండెలు అవిసిపోయాయి. కలిసి చదువుకున్న స్నేహితుల హృదయాలు తల్లడిల్లాయి. డిగ్రీ విద్యార్థిని మధుమేహంతో ప్రాణాలు కోల్పోవడం ఎల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన నేవూరి ప్రభాకర్‌రెడ్డి–లత దంపతుల కూతురు చందనారెడ్డి డిగ్రీ చదువుతోంది. చందనారెడ్డి షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం కంటిచూపు స్వల్పంగా కోల్పోయింది. ఫిట్స్ కూడా రావడంతో చికిత్స పొందుతోంది. ఈక్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో ఆరు నెలలుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆరోగ్యంగా తిరిగి వస్తుందనుకున్న తల్లిదండ్రుల కలలు నెరవేరలేదు. ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు కోల్పోయింది. కూతురును కాపాడుకునేందుకు ఆ తండ్రి రూ.9.50 లక్షల వరకు వెచ్చించాడు. అయినా ప్రాణం నిలువలేదు. కుటుంబ సభ్యులు, స్థానికుల రోదన మధ్య సోమవారం అంతిమయాత్ర నిర్వహించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు, రుద్రంగి ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు. రుద్రంగిలోని ఇందిరాచౌక్‌లో నివసించే పుట్కపు లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం బంధువుల ఇంటికెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం అటుగా వచ్చి గమనించిన చుట్టుపక్కల వారు లక్ష్మికి సమాచారం ఇచ్చారు. బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో దాచిన మూడు తులాల బంగారం, రూ.4వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రుద్రంగి ఎస్సై ప్రభాకర్ క్లూస్ టీంతో వెళ్లి ఆనవాలు సేకరించారు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మొండయ్య (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన రేవెల్లి మొండయ్య(38) అనారోగ్యం పాలై మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం పురుగుల మందు దాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య మధునమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిలో మేటి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో సిరిసిల్ల బల్దియా అభివృద్ధిలో మేటిగా నిలుస్తోందని చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ వార్డులను కలుపుతూ నిర్మిస్తున్న లింకురోడ్డు పనులకు సోమవారం పూజలు చేశారు. పట్టణంలోని రోడ్ల నిర్మాణానికి రూ.6.90కోట్లు ఖర్చవుతున్నట్లు జిందం కళ తెలిపారు. మొదటిదశలో మంత్రి కేటీఆర్ అందించిన రూ.2.10కోట్లతో రూపుదిద్దుకుంటున్న రోడ్డు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. తెలంగాణ పవర్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు న్యాయం చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షం డిమాండ్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: అనాథ పిల్లలు ఉన్నత చదువులు చదివి.. సామాజికంగా.. ఆర్థికంగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. అనాథల కోసం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనాథల కోసం ప్రతి జిల్లాకు ఓ గురుకులం ప్రారంభించాలని, స్మార్ట్‌కార్డులు అందించాలని, కేజీ టు పీజీ ఉచిత విద్యను అమలు చేయాలని కోరారు. ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్, జిల్లా కోఆర్డినేటర్ కానాపురం లక్ష్మణ్, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, బొల్లారం చంద్రమౌళి, సుంకపాక దామోదర్, కర్రోల్ల లలిత పాల్గొన్నారు.

బాలల హక్కులను గుర్తించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- జాతీయ బాలికల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల: సమాజంలో బాలలకు ఉన్న హక్కులను గుర్తించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లో జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణాపై ప్రచారం చేయాలన్నారు. చిన్నపిల్లలకు, బాలికలకు ఆపదొస్తే, వేధింపులు ఉంటే 1098లో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం, బాలల సంక్షేమ సమితి చైర్మన్ కమటం అంజయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆర్.స్వర్ణలత ఉన్నారు.

దివ్యాంగుడికి బ్యాటరీ ట్రైసైకిల్


దివ్యాంగుడితో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన పినగాని రాజశేఖర్‌కు కలెక్టర్ అనురాగ్ జయంతి బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందజేశారు. సోమవారం జరిగిన ప్రజావాణికి బాధితుడు ట్రైసైకిల్ కోసం కలెక్టర్‌ను వేడుకున్నాడు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే బ్యాటరీ మోటార్ ట్రైసైకిల్‌ని అందజేశారు.

వరదకాల్వను కబ్జా చేశారు


కలెక్టర్ అనురాగ్ జయంతికి ఫిర్యాదు చేస్తున్న ముడికె చంద్రశేఖర్

సిరిసిల్ల: వేములవాడ పట్టణంలో వరదకాల్వను కబ్జా చేసి, అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని మారుపాక మాజీ సర్పంచ్ ముడికె చంద్రశేఖర్ కలెక్టర్ అనురాగ్ జయంతికి సోమవారం ఫిర్యాదు చేశారు. వేములవాడ శివారులోని సర్వేనంబరు 1561 నుంచి 1546, 1547 వరకు మూలవాగు వరకు వరద కాల్వ ఉందని వివరించారు. కంటాల వేణు, కంటాల రాజులు వరదకాల్వను ఆక్రమించి, ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించాలని చంద్రశేఖర్ కోరారు.

సామాజిక సేవలో యువత

- రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు గుడ్ల రవి
- సిరిసిల్లలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న గుడ్ల రవి

సిరిసిల్లటౌన్: దేశాభివృద్ధిలో కీలకమైన యువత సామాజిక సేవలోనూ ముందుంటుందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుడ్ల రవి అభినందించారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని సొసైటీ, సుభాష్‌నగర్ యూత్‌వింగ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేసిన 50 మంది యువకులకు అభినందనపత్రాలను అందించారు. సొసైటీ ప్రతినిధులు తాటిపాముల శివప్రసాద్, బుడిమె శివప్రసాద్, ప్రయాకర్‌రావు వేణు, యువజన సంఘం ప్రతినిధులు యెల్లె లక్ష్మీనారాయణ, కట్ల ఆనందం పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన మానాల పవిత్రను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న సంఘటనలో ముగ్గురిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. దుమాలకు మానాల శేఖర్‌తో పవిత్రకు 2016లో వివాహమైంది. వీరికి ఒక కుమారు, కూతురు. పెళ్లయిన రెండేళ్ల వరకు బాగానే చూసుకున్న భర్త, అత్తమామలు తర్వాత నుంచి రూ.2 లక్షల అదనపు కట్నం వేవాలని శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించారు. ఇటీవల ఇంటి నుంచి పంపించివేశారు. దీంతో బాధితురాలు పవిత్ర పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుతో భర్త శేఖర్‌తోపాటు అత్త నర్సవ్వ, మామ కాశయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మార్పు మంచికే..

- ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకెళ్తున్న పోలీసులు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- ప్రజల్లో మారుతున్న వైఖరి
- ఠాణాలకు ధైర్యంగా వెళ్తున్న పల్లెజనం
- భయం పోయి గౌరవం చూపుతున్న వైనం


మర్రిపల్లి కస్తూర్బాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

వేములవాడరూరల్: సిరిసిల్ల ప్రాంతంలోని పల్లెల్లో ఇరువై ఏళ్ల క్రితం పోలీసులు అంటేనే వణికిపోయే పరిస్థితులు ఉండేవి. పోలీసుల బూట్ల చప్పుళ్లతో మేలుకొనే పల్లెలు.. ఎన్‌కౌంటర్ వార్తలో గజగజ వణికే పల్లెల్లో నేడు వాతావరణం పూర్తిగా మారిపోయింది. నాడు నక్సలైట్ల సానుభూతిపరులంటూ యువకులను వేదించిన పోలీసులు.. నేడు ఉపాధి కల్పించేందుకు అవగాహన సదస్సులతో ముందుకెళ్తున్నారు. సమాజంలో పేరుకుపోయిన మూఢవిశ్వాసాలను పారదోలేందుకు పల్లెల్లో రాత్రి వేళ పోలీస్ కళాబృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగరుకలను చేస్తున్నారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలతో ప్రజల్లో మార్పు వచ్చింది. పోలీసులు అంటే భయం పోయి గౌరవం పెరిగింది. ఇదే సమయంలో తమ సమస్యలను చెప్పుకునేందుకు ధైర్యంగా ఠాణాలకు వెళ్తున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో మారిన వైఖరి

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల్లో చాలా మార్పు వచ్చింది. చిన్న.. చిన్న కేసుల్లో పట్టుకున్న వారిని సైతం విరగ్గొట్టే పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో తీరు మార్చుకున్నారు. అంతేకాకుండా పల్లెలకు వెళ్లి సామాజిక రుగ్మతలపై గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 13 పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీస్ కళాబృందాలు, కమ్యూనిటీ పోలీసింగ్ పేరుతో ప్రత్యేక బృందాలు వారంలో నాలుగు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. పోలీస్ కళాబృందం ఒక పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలలో ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ బృందం సభ్యులు ప్రతీ ఠాణా పరిధిలో వారంలో నాలుగు గ్రామాలలో పర్యటిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పోలీసులు అంటే భయం పోయి గౌరవం పెరుగుతోంది.

ప్రజలకు వివరిస్తూ...

కళాబృందం, కమ్యూనిటీ పోలీసింగ్ సిబ్బంది చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రధానంగా సైబర్‌నేరాలు, డ్రంకెన్‌డ్రైవ్, మైనర్ పిల్లల డ్రైవింగ్, లైంగిక దాడులు, ఈవ్‌టీజింగ్, భూసమస్యలు, కక్షసాధింపులు, సివిల్ సమస్యలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పాఠశాలలు, హాస్టళ్లు, బస్టాండ్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఈ కళాబృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

పోలీసులపై నమ్మకం పెరిగింది



గతంలో పోలీసులు అంటేనే భయం ఉండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు కూడా పార్టీలకు అతీతంగా సమాన న్యాయం చేస్తున్నారు.

– బొడ్డు నారాయణ, అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నూకలమర్రి


చాలా మార్పు వచ్చింది



గ్రామాల్లో పోలీసులు అంటేనే ఎంతో భయం ఉండేది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పోలీసులు అంటే ప్రజల్లో భయం తొలగిపోయింది. ప్రజలతో పోలీసులు కూడా మంచి స్నేహభావంతోనే ఉంటున్నారు.

– సామ తిరుపతిరెడ్డి, లింగంపల్లి

మావాళ్లే అనే భావన వచ్చింది



గతంలో పోలీసులు అంటే ప్రజలు శత్రువులుగా చూసేవారు. ప్రస్తుతం పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలతో ప్రజల్లో చాలా మార్పు వచ్చింది. పోలీసులు కూడా మావాళ్లే, మా కోసమే పనిచేస్తున్నారనే భావన వచ్చింది.

– నాగేంద్రాచారి, డీఎస్పీ, వేములవాడ